క్లుప్తంగా

వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' ప్లస్

వైవీయూ: కడప నగరంలోని శ్రీవివేకానంద మహిళా డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) వారు ఏ ప్లస్ గ్రేడ్‌ను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 6,7 తేదీల్లో న్యాక్ పీర్ టీం ప్రతినిధులు ఆచార్య కె. మణిమేకలై కాళిదాసన్ (తమిళనాడు) ఆచార్య జైశ్రీసూర్య వనీష్ (మహారాష్ట్ర), పుర్జాకల సమంత్ (గోవా)ల బృందం కళాశాలను పరిశీలించారు. పలు అంశాలను పరిగణలోకి తీసుకుని వీరికి న్యాక్ గ్రేడింగ్ కేటాయించారు. 7 పాయింట్ల విధానంలో కుములేటివ్ గ్రేడ్ పర్ ఆవరేజ్ (సీజీపీఏ) 3.47 కేటాయించి ఏ ప్లస్ గ్రేడ్ కేటాయించారు. కళాశాలకు ఈ గ్రేడింగ్ 5 సంవత్సరాల పాటు ఉంటుంది. కళాశాలకు ఉత్తమ గ్రేడ్ లభించడంపై కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి, డైరెక్టర్లు మధుసూధన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, ప్రిన్సిపాల్ కమలరాణి సంతోషం వ్యక్తం చేశారు.

న్యాయశాస్త్ర విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయశాస్త్ర విద్య విద్యార్థుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. మంగళవారం వైవీయూలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ప్రకటించిన సెమిస్టర్ పరీక్షల షెడ్యూలులో పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు అవకాశం లేకుండా వరుసగా పరీక్షల షెడ్యూలు ప్రకటించారన్నారు. రోజు మార్చి రోజు పరీక్షలు నిర్వహించేలా చూడాలని కోరారు. విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విభాగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి. సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆర్. నరసింహులు, డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు


క్రీడాకారులను అభినందిస్తున్న స్టెప్ సీఈఓ

కడప స్పోర్ట్స్: చిత్తూరులో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన అండర్–17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు కాంస్యపతకాలు సాధించారు. 41 కేజీల గ్రీకో స్టైల్ విభాగంలో ప్రతాప్, 61 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో మహేష్, 41 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో గణేష్ కాంస్యపతకాలు సాధించారు. వీరిని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ అభినందించారు. కార్యక్రమంలో రెజ్లింగ్ శిక్షకుడు మస్తాన్ పాల్గొన్నారు.

రేపు కాలాష్టమి పూజలు

కడప కల్చరల్: కడప నగర శివార్లలోని మగ్దూం సాహెబ్ కొట్టాలలోని శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో గురువారం కాలా భైరవాష్టమి పూజలను నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటలకు ఈ పూజలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు మేరువ బాలాజీరావు తెలిపారు.


మందులు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: ఎండల తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా పిల్లలకు, వృద్ధులకు, వయోజనులకు మంగళవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో హోమియో మందులను పంపిణీ చేశారు. కడప తారకరామనగర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యాకమిటీ సలహాదారు శ్రీనివాసులు హాజరై మాట్లాడుతూ వేసవి తీవ్రత నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యాకమిటీ సభ్యులు విజయలక్ష్మి, ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ నరేష్, అఖిల పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

కడప కార్పొరేషన్: కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (30 రోజులు) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 ఏళ్లలోపు కలిగి గ్రామీణ ప్రాంత మహిళలు ఈ కోర్సులకు అర్హులని వివరించారు. ఈనెల 19వ తేది నుంచి శిక్షణ ప్రారంభం కానుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9440905478, 6302833548 నంబర్లకు ఫోన్ చేసిగానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వాటర్ బాటిళ్లు పంపిణీ


కార్మికులకు టోపీలు, వాటర్‌బాటిళ్లు అందజేస్తున్న శ్రీరంజన్ రెడ్డి

కడప కార్పొరేషన్: నగరంలోని 20వ డివిజన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వాటర్ బాటిళ్లు, టోపీలను వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పారిశుధ్య కార్మికులకు ఇబ్బందులు కలగకుండా టోపీలు, వడదెబ్బ తగలకుండా నీటిని తెచ్చుకోవడానికి వాటర్ బాటిల్స్ ఉపయోగపడతాయన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే

- డిప్యూటీ సీఎం అంజద్ బాషా
- నగరంలో ఘనంగా పూలే జయంతి

కడప కార్పొరేషన్: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పూలేను ఆదర్శంగా తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు...బ్యాక్ బోన్ క్లాస్ అని పేర్కొంటూ వారిని చేయిపట్టి రాజ్యాధికారం వైపు నడిపిస్తున్నారన్నారు. మంత్రివర్గ కూర్పులో 11 మంది బీసీలకు స్థానం కల్పించారని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, పాకా సురేష్ కుమార్, సీహెచ్ వినోద్, సుబ్బారెడ్డి, షఫీ, తోటక్రిష్ణ, పస్తం అంజి, గోపాలక్రిష్ణ, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

- దళిత, బడుగు, బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిరావు పూలే ఆరాధ్య దైవమని బీసీ ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చయ్యగారి నాగమల్లేష్ అన్నారు.
- కడప నగరంలోని శంకరాపురంలో ఉన్న ట్రాన్స్‌కో నిలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప జోనల్ చీఫ్ ఇంజినీర్ పి మోహన్‌రావు, విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జీకే వీరభద్రయ్య ముఖ్య అతిథులుగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న ఏఎఫ్‌యూ వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు


జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న గోవిందు నాగరాజు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పాత బస్టాండులోని పూలే కాంస్య విగ్రహానికి దళితమిత్ర సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, దళిత మిత్ర యువ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రవీణ్‌కుమార్ పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళతామని చెప్పారు.

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

- మహాజన రాజ్యం పార్టీ అధ్యక్షులు సంగటి మనోహర్, బీసీ, ఎస్సీల నాయకులు అవ్వారు మల్లికార్జున తదితరులు పూలే సేవలను కొనియాడారు.
- రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.నారాయణయాదవ్, ప్రధాన కార్యదర్శి పాములేటి యాదవ్, కార్యదర్శి రామ్మూర్తి యాదవ్, ఓబులేశు యాదవ్ తదితరులు పూలేకు నివాళి అర్పించారు.
- బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఓబయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంస్కర్త అని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పాతబస్టాండు వద్ద నున్న ఆయన విగ్రహానికి, ఇందిరాభవన్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు కుళ్లాయప్ప, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

- సీపీఐ నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ,నాయకులు చంద్రశేఖర్, కెసీ బాదుల్లా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.
- సమాజంలో మార్పు కోరిన వ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్‌సీపీ నాయకులు శంకర్, శేఖర్, మగ్బూల్ బాషా, తస్లీమ్ పాల్గొన్నారు.
- బడుగు, బలహీన వర్గాల మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే అని డీవైఎఫ్ఐ నాయకులు వీరణాల శివకుమార్, ఓబులేసు పేర్కొన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కడప ఎడ్యుకేషన్: యస్వీ డిగ్రీ కళాశాలలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అంకన్న తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు గౌస్, అతిఫ్, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పూలే

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహాత్మా జ్యోతిబా పూలే అందరికీ ఆదర్శప్రాయుడని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కడప ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కడప రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీపీఎం రాజా గజలక్ష్మి, కర్నూలు డిప్యూటీ సీఎంఈ రజియా సుల్తాన, డిప్యూటీ సీఎంఈ లక్ష్మిభాస్కర్, కడప జోన్‌కార్గో మేనేజర్ రమేష్, వీఎస్అండ్ఎస్ఓ ముజిబుర్ రెహ్మాన్, ఈడీ సీసీ సురేంద్ర, యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో... భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా పాత బస్టాండులోని ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ యాదవ్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మాభాయి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్యాణ్ పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో..

కడప కల్చరల్ : కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. ఉప గ్రంథ పాలకులు పవన్‌కుమార్ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది బాబ్జి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కమలాపురం : ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి విశేషంగా కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే జయంతిని పురస్క రించుకుని పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు

కడప కల్చరల్: కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు.ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా నడివీధి గంగమ్మ వార్షికోత్సవం


కలశాలతో మహిళా భక్తుల ఊరేగింపు

కడప కల్చరల్: హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రం మూడవ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక మహిళలు పాండురంగస్వామి ఆలయం నుంచి పవిత్ర జలాలు నింపిన అలంకృత కలశాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా గంగమ్మ క్షేత్రానికి చేరుకున్నారు. తాము తెచ్చిన జలాలతో అమ్మవారిని అభిషేకించి అనంతరం విశేష అలంకారం చేశారు. అమ్మవారి సన్నిధిలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం రాహుకాల పూజ నిర్వహించారు. సాయంత్రం గోమాతకు సీమంతం నిర్వహించారు.

సందడిగా ప్రసన్న విశ్వేశ్వరుడి రథోత్సవం


రథోత్సవంలో స్వామి, అమ్మవారు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం రథోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు, అలంకారం నిర్వహించారు. సాయంత్రం కనుల పండువగా అలంకరించిన రథంపై అలంకార మూర్తులైన ఆది దంపతులను కొలువుదీర్చారు. దేవదాయశాఖ కడప నగర గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో అర్చకులు రవిశంకర్ బృందం వేదమంత్రోచ్చాటనలతో ప్రత్యేక పూజలనంతరం రథయాత్రను ప్రారంభించారు.శివనామ స్మరణలు చేస్తూ మాడవీధుల్లోని భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాలలో బుధవారం ఏకాంత సేవ నిర్వహించనున్నారు.

పీఎఫ్ సమస్యల పరిష్కారానికి వినతి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి కంభం బాల గంగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణరెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలామంది ఉపాధ్యాయులు తమ అవసర నిమిత్తం లోన్లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారందరికీ లోన్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే జెడ్పీ పీఎఫ్ మిస్సింగ్ క్రెడిట్స్‌ను సరిచేసి వాటిని ఆన్‌లైన్ చేయించాలని కోరారు. స్పందించిన సీఈఓ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీలేదు

మధ్యాహ్న భోజన ఏడీ దేవరాజు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏడీ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతలో ఎక్కడా రాజీ పడేదిలేదని మధ్యాహ్న భోజన అసిస్టెంట్ డైరెక్టర్ దేవరాజు స్పష్టం చేశారు. మంగళవారం కడప నగరంలోని ఉర్దూ బాలికల హైస్కూల్‌ను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే స్టాక్ రిజిస్టర్‌తోపాటు స్టాకును పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేసే గుడ్లు, చిక్కీలతోపాటు భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. హెడ్‌మాస్టర్ జావిదాఖానం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ఉద్యమాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రైతు ఉద్యమ అమర వీరుల త్యాగాల స్ఫూర్తితో రైతుల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో అఖిల భారత కిసాన్ సభ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతు విమోచన చట్టం సాధన కోసం రైతులు ఐక్యంగా పోరాడాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు గోపాల కృష్ణయ్య, చిన్న సిద్దయ్య, పుల్లయ్య, చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకర్‌కు ఆంధ్రరత్నం అవార్డు

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన డాక్టర్ ఎం.ప్రభాకర్ ఆంధ్రరత్నం అవార్డుకు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఓఎస్‌డీగా ఉన్న ప్రభాకర్‌కు విశాఖపట్టణానికి చెందిన అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ అవార్డును అందజేయనున్నారు. అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక మహోత్సవం–2023 పేరిట నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ఈనెల 24న అందజేయనున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ ఎం.ప్రభాకర్ పలు రచనలు చేసి రచయితగా పేరుగాంచారు.

'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష స్పందన


42వ డివిజన్‌లో సర్వే చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్


17వ డివిజన్‌లో సర్వే చేస్తున్న కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: కడప నగరంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళుతున్న కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు నినదిస్తున్నారు. కడప నగరంలోని 20వ డివిజన్ మారుతీనగర్, ఏపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డిలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు.

- 4వ డివిజన్లోని బుడ్డాయపల్లెలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును తెలుసుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. సుశాంత్, సుహాసిని పాల్గొన్నారు.
- స్థానిక 42వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సర్వేలో భాగంగా రూపొందించిన ప్రశ్నలను ప్రజలను అడిగి వారి సమాధానాలు నోట్ చేసుకొని వారికి స్లిప్ ఇచ్చారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.
- 17వ డివిజన్‌లో కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇళ్ల వద్దకు వెళ్లి ఈ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు.

సమాజ పురోగతికి విద్య ఒక్కటే మార్గం

కడప ఎడ్యుకేషన్: సమాజ పురోగతికి విద్య ఒక్కటే మార్గమని విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని చౌడేశ్వరిదేవి ఓరియంటల్ ఎయిడెడ్ హైస్కూల్లోని విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకుని అందుకు అనుగుణంగా పోరాటం చేయాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ముందస్తుగా భవిష్యత్తు గురించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. రానున్న కాలంలో ఒక మంచి స్థానంలో స్థిరపడాలని తద్వారా తల్లితండ్రులకు పేరు ప్రతిష్టలను నిలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత నైపుణ్య శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో డీడీయూ జీకేవై పథకం ద్వారా ఎస్ఈఈడీఏపీ సౌజన్యంతో కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతోపాటు కంప్యూటర్‌బేసిక్స్, స్పోకన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. అడ్మిషన్‌కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7013665112, 9059160549 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నీటి సరఫరాలో ఆటంకాలు కలగకూడదు


ఆర్‌కే నగర్ పర్యటనలో వార్డు సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

కడప కార్పొరేషన్: కడప నగరంలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ సూచించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 4వ డివిజన్ ఆర్‌కే నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా గార్బేజ్ పాయింట్లను, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఆర్‌కే నగర్ నుంచి యూజీడీ ప్రక్రియ ద్వారా మురికి నీటిని తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మాసాపేట, కేసీ కెనాల్ పోస్ట్ రోడ్, సాయిపేట, మంజుమియ్యా పార్కు ప్రాంతాల్లో పర్యటించారు. ఎర్రముక్కపల్లె నుంచి సంధ్యా సర్కిల్ వరకూ పాత్ వే ఏర్పాటు చేయాలని, మాసాపేట శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. సాయిపేట శ్మశానవాటికను మట్టితో నింపాలని తెలిపారు. మంజుమియ్యా పార్కులో గ్రానైట్ బెంచీలు, ఫెన్సింగ్ చేసి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సీపీ సంజీవ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ రత్నాల రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయుడు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులన్నీ ఆరు మాసాల్లో పూర్తికి కృషి

కమలాపురం : మున్సిపాలిటీకి మంజూరైన అభివృద్ధి పనులన్నీ ఆరు మాసాల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మార్పురి మేరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా సీనియర్ అసిస్టెంట్ రాము అజెండాలోని 13 అంశాలను చదివి వినిపించారు. అన్ని అంశాలను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కౌన్సిలర్లంతా కలసి కట్టుగా మున్సిపాలిటీకి మంజూరైన అభివృద్ధి పనులన్నీ ఆరు మాసాల్లో పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇప్పటికే రూ.36కోట్లు వెచ్చించి నిర్మించిన డ్రైనేజ్ పనులు అక్కడక్కడ పెండింగ్ ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముందుగా వాటిని పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 5వేల గృహాలకు ఉచితంగా మంచి నీటి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించామని, ముందుగా ఆ పనులు గ్రౌండింగ్ చేయాలన్నారు. పైప్ లైన్ పనులు పూర్తి అయితే రోడ్లు మరమ్మతులు, రోడ్ల విస్తరణ తదితర పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. రూ.8.75 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు.

బైపాస్‌కు మోక్షం :

కమలాపురం పట్టణ శివారులో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఫస్ట్ ఫేస్‌లో ఫైనాన్స్ క్లియరెన్స్ వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే సర్వే పూర్తి అయిందని, అయితే రైతులు కొంత మేరకు భూములు త్యాగం చేయాలన్నారు. ఏ రైతుకు ఎంత మేరకు భూమి పోతుందో చూసి నష్ట పరిహారం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తామన్నారు. పట్టణంలో ఒక ఆర్‌టీబీ, బైపాస్‌లో మరో ఆర్‌టీబీ నిర్మిస్తామన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


అనిమెలలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అనిమెల గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఉత్తమమైన పరిపాలన అందించే ఏకైక రాష్ట్రం ఆంధ్ర రాష్ట్రమని తెలిపారు.అలాగే అనిమెల గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి గత ప్రభుత్వ, ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని తేడాలను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాపురెడ్డి, సర్పంచు నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవ యాదవ్, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, గడ్డంవారి సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభారతి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.